# నాడు ఓడినా ప్రజల్లోనే ఉన్నా

- నాలుగు సార్లు గెలిపించిన నియోజకవర్గ ప్రజలనే మోసం చేసిన దొంగ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు
- తాను దేశ పౌరుడు కాదని 15 ఏండ్ల క్రితమే చెప్పినా
- 45సార్లు జర్మనీ పౌరుడని నిరూపించినా బుకాయింపే
- రమేశ్ బాబుది లా మేకర్ చరిత్ర కాదు.. లా బ్రేకర్ చరిత్ర
- ఆయన స్వార్థంతో నియోజకవర్గానికి అన్యాయం
- 15 ఏళ్లుగా నాకు అన్యాయం జరిగిందని కోర్టే చెప్పింది
- వ్యక్తిగతంగా తనపై నాకెలాంటి కోపం లేదు
- ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడ్డా కాబట్టే నేడు ప్రజల ఆశీర్వదంతో గెలిచా
- ఎవరిన్ని చేసినా చివరికి న్యాయమే గెలిచింది..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- పౌరసత్వం కేసులో హైకోర్టు తీర్పుపై హర్షం



**ప్రజానావ, వేములవాడ:** గతంలో ఓడినా నియోజకవర్గ ప్రజల్లోనే ఉన్నానని, ఎమ్మెల్యేగా గెలిచిన చెన్నమనేని రమేశ్ మాత్రం జర్మనీలో ఉంటూ ఇటు దేశాన్ని.. అటు నియోజకవర్గ ప్రజలను పదిహేనేళ్లుగా మోసం చేశారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు జర్మనీ పౌరుడేనంటూ ఆయన పౌరసత్వంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆది శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. 15ఏళ్ల తన ధర్మపోరాటంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరితో పాటు మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనకు అండగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రులు రత్నాకర్ రావు, జీవన్ రెడ్డిలతో పాటు కేంద్ర మంత్రులకు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ మిత్ర బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ దేశ పౌరుడు కాదని తాను 15ఏళ్ల క్రితమే చెప్పానని గుర్తుచేశారు. అంతేకాకుండా 45 సార్లు అతను జర్మనీ పౌరుడని నిరూపించినా బుకాయించాడని, ఇప్పుడు హైకోర్టు తీర్పు హేతుబద్ధంగా లేదని, నిరాశపరిచిందని అనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ చరిత్రలోనే ఇలాంటి కేసు నమోదు కాలేదని, ఆయన లా మేకర్ చరిత్ర కాదు.. లా బ్రేకర్ చరిత్ర అని విమర్శించారు.

### నా పోరాటంతోనే భారతదేశ పౌరసత్వం

నేను చేసిన పోరాటంతోనే రమేశ్‌బాబు 2013లో భారతదేశ పౌరసత్వం తీసుకున్నారని ఆది పేర్కొన్నారు. అయన ఏనాడైతే భారతదేశ పౌరసత్వం తీసుకున్నాడో ఆనాడే తాను నైతికంగా గెలిచానని చెప్పారు. ఓవైపు జర్మనీని ప్రేమిస్తూనే అటు దేశాన్ని.. ఇటు నియోజకవర్గ ప్రజలను మోసం చేశారన్నారు. 2013 నుంచి 2023 వరకు ఆయన ఓసీఐ కార్డు కలిగి ఉన్నారని, 2019లో మళ్లీ జర్మనీలోని బెర్లిన్ లో ఓసీఐ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే అని చెబుతూ అక్కడ ప్రొఫెసర్ అని చెప్పుకుంటూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలను మోసం చేసి అడ్డంగా దొరికిపోయిన దొంగ రమేశ్ బాబు అని విమర్శించారు. తన తీరుతో ఆయన వంశానికి, తల్లిదండ్రులకు చెడ్డ పేరు తీసుకొచ్చారన్నారు. గతంలోనే రమేశ్ బాబు జర్మనీ పౌరుడైనని కేంద్ర హోంశాఖ మూడుసార్లు చెప్పిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 15 ఏళ్లుగా నాకు అన్యాయం జరిగిందని సాక్షాత్తూ కోర్టే చెప్పిందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో పోటీ చేసి ఓడినా నియోజకవర్గ ప్రజల్లోనే ఉన్నానని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో గెలిచి ఇప్పటికే రూ.750 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానని, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుతో కలికోట సూరమ్మ చెరువు, మరిపెల్లి రిజర్వాయర్ పనులు మొదలై కొనసాగుతున్నాయన్నారు.

రమేశ్‌బాబు.. ఏం సాధించావ్?

రమేశ్‌బాబు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తనను ఎన్నో అవమానాలు, అవహేళనలు చేశారని, ఇవన్నీ చేసి ఇప్పుడు ఏం సాధించావు అని ప్రశ్నించారు. నాది మచ్చలేని కుటుంబమని చెప్పుకున్న ఆయన కోర్టు తీర్పుతో ఈ సమాజానికి ఏం చెబుతావని రమేశ్‌బాబుని నిలదీశారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గత పదిహేనేళ్లుగా రమేశ్ బాబుపై తాను న్యాయపరంగా పోరాటం చేశానే తప్పితే ఏనాడూ వ్యక్తిగతంగా విమర్శలు చేయలేదని గుర్తుచేశారు. కానీ రమేశ్‌బాబుతో పాటు ఆయన అనుచరులు తనను ఎన్నో ఇబ్బందులు పెట్టారని, చివరికి కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేశారన్నారు. తనంటే వ్యక్తిగతంగా నాకు ఎలాంటి కోపం లేదని, ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడ్డాను కాబట్టే ఈరోజు గెలిచానని ఆది శ్రీనివాస్ భావోద్వేగానికి గురయ్యారు. ఎవరిన్ని చేసినా చివరికి న్యాయమే గెలిచిందన్నారు. చెన్నమనేని రమేశ్‌బాబుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు భారత న్యాయవ్యవస్థలోనే చారిత్రాత్మక తీర్పుగా అభివర్ణించారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాది తర్వాత గెలిచిన రోజే అది కూడా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసిన రోజు కోర్టు తీర్పు రావడం ఆనందంగా ఉందన్నారు. న్యాయస్థానాలపై తనకు నమ్మకం ఉందని, 15 ఏళ్లుగా కోర్టులను, దేశాన్ని మోసం చేసినందుకు హైకోర్టు రూ.30 లక్షల జరిమానా విధించడం ప్రపంచంలో మొదటిసారని, ఈ తీర్పుతో ఇలాంటి తప్పు చేయడానికి అందరూ భయపడతారన్నారు.

## అంతరిక్ష ప్రాజెక్టుల్లో బెల్లంపల్లి శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

అభినందించిన పట్టణ సీఐ సయ్యద్ అబ్దుల్ అజీమ్, ఎస్సై మహేందర్, ప్రిన్సిపాల్ సంజీవ్



**ప్రజానావ, బెల్లంపల్లి :**

బెల్లంపల్లి శ్రీ చైతన్య పాఠశాల కు చెందిన విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలో తమ ప్రతిభతో మరోసారి చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. నాసా అనుబంధ నేషనల్ స్పేస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాజెక్టు కార్యక్రమానికి ఈ పాఠశాల విద్యార్థులు మూడు ప్రాజెక్టులను రూపొందించారు. ఈ ప్రాజెక్టులు భూమిపై జీవించడం అసాధ్యమైన పరిస్థితుల్లో, అంతరిక్షంలో జీవన మార్గాలపై దృష్టి సారించి రూపొందించబడ్డాయి. విద్యార్థుల ప్రతిభను పట్టణ సీఐ సయ్యద్ అబ్దుల్ అజీమ్, ఎస్సై మహేందర్, ప్రిన్సిపాల్ సంజీవ్ ప్రశంసిస్తూ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్లు శ్రీవిద్య,ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాజెక్టులు గుర్తింపు పొందే అవకాశం ఉందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీన్ సతీష్,నాసా ఇంచార్జి క్రాంతి కిరణ్ , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

క్రీడాకారులకు టీషర్టులను అందించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ప్రజానావ, ఆదిలాబాద్ :**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం తలమడుగు మండలంలోని కోడద్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఖోఖో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపిక జట్లకు,సభ్యులకు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముద్రించిన టీషర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఖోఖో సంఘం, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాంత్ రెడ్డికి, శాలువాతో సత్కరించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. ఓటమి చెందామని నిరుత్సాహ పడకుండా మరింత శ్రమించి ప్రతిభను కనబరచాలని సూచించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు, వారిని తీర్చిదిద్దుతున్న కోచ్ లు, సైన్యంలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన రాజారెడ్డి, కన్నం అశోక్, ప్రదీప్ లను సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం చదువుతో పాటు క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తూ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తోందన్నారు. అలాగే 57సంవత్సరాల తర్వాత హైదరాబాద్ లో ఫుట్ బాల్ క్రీడా ప్రతిష్టాత్మక టోర్నీ సంతోష్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వడం సంతోషకరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి గల ఏదేని క్రీడలో ప్రతిభ కనబర్చి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామగుండం ఏసీపీ జానీ నర్సిములు, డిఎస్పీ నర్సింలు, జిల్లా గిరిజన క్రీడాల అధికారి పార్థసారథి, జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎన్.శ్రీధర్ రెడ్డి, ఏ. దయానంద్ రెడ్డి, మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తడ్సేన వెంకట్ రెడ్డి, నలిమేల నవీన్ రెడ్డి, కృష్ణ, పోచ్చన్న, లక్ష్మి, మెట్టు కిరణ్, శివ, జయశ్రీ, రాష్ట్ర పాల్, మాజీ సర్పంచ్ ఆనంద్, వెంకటేష్, ఇర్ఫాన్ ఖాన్, ఫెరోజ్ ఖాన్ ,అడెల్లు తదితరులు పాల్గొన్నారు

## త్వరలో జర్నలిస్టులకు తీపి కబురు



- టీయూడబ్ల్యూజే నేత నగునూరి శేఖర్

**ప్రజానావ, ఆసిఫాబాద్ టౌన్ :** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు త్వరలో తీపి కబురు అందుతుందని టీయూడబ్ల్యూజే నేత నగునూరి శేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా టియుడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల సమస్య , హెల్త్ కార్డుల సమస్యలు పరిష్కారం అవుతాయని త్వరలో సీఎం రేవంత్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ విలేకరుల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు ఎన్ తారు, మేకల శ్రీను , రాధాకృష్ణ చారి, బిక్కాజీ, తిరుపతి చారి, అబ్దుల్ హన్నాన్, విజయ్, సాయి, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 2 పరీక్షలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలి



**ప్రజానావ, ఆసిఫాబాద్:**

గ్రూప్ 2 పరీక్ష కొరకు జిల్లాలో ఏర్పాటుచేసిన 18 పరీక్ష కేంద్రాలలో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సంక్షేమ పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్.పి. శ్రీనివాసరావు, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పరీక్షల నోడల్ అధికారి దీపక్ తివారి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 15, 16 తేదీలలో జరగనున్న గ్రూప్ 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రం ప్రాంగణం, ముఖ్య పర్యవేక్షకులు గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పర్యవేక్షించాలని, అవసరమైన ఫర్నిచర్, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈనెల 15, 16 తేదీలలో ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం 2 పేపర్లు ఉంటాయని, పరీక్ష కేంద్రంలో అనుమతిలేని సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, షూలు గేటు బయట తీసుకొని పరీక్షా సమయం పూర్తయ్యే వరకు భద్రపరచాలని, అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. ఉదయం పరీక్షకు 9:30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు రెండున్నర గంటలకు గేట్లు మూసి వేయడం జరుగుతుందని, తదుపరి ఎవరిని అనుమతించవద్దని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పి టి జి గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న గ్రూప్ టూ పరీక్షల కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బాధితురాలికి పరిహారం అందించిన విద్యుత్ అధికారులు

**ప్రజానావ, బెజ్జూర్ :**

మండలంలోని గోల్కొండ గ్రామంలో గత జూన్ మాసంలో విద్యుత్ ఆగాదానికి అప్పల ఎంకమ్మ అనే రైతుకు చెందిన మూడు గేదెలు మృతి చెందినట్లు విద్యుత్ అధికారి అసిస్టెంట్ ఇంజనీర్ అంజల్ తెలిపారు. విద్యుత్ అగాథంలో గేదెలు మృతి చెందడంతో విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసుకోగా బాధితురాలి పేరా 1,20,000 పరిహారం మంజూరైనట్లుగా తెలిపారు. ఈ నష్టపరిహారాన్ని శుక్రవారం బాధితురాలికి చెక్కు రూపకంగా అందించడం జరిగిందన్నారు. విద్యుత్ అగాధంతో పశువులు మరణించినట్లయితే శాఖ పరంగా దరఖాస్తు చేసుకున్న వారికి సమగ్ర విచారణ అనంతరం నష్టపరిహారం అందించడం జరుగుతది అన్నారు. అదేవిధంగా అడవి జంతువుల కోసం విద్యుత్ ఉచ్చులను ఏర్పాటు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లులను వినియోగదారులు సకాలంలో చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. వీరితో సబ్ ఇంజనీర్ అజయ్ లైన్ ఇన్స్పెక్టర్ మల్లేష్ తదితరులు ఉన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై మొబైల్ యాప్ ద్వారా నమోదు శిక్షణ



**ప్రజానావ, నర్సాపూర్ జి:**

నర్సాపూర్ జి రైతు వేదికలో ఎంపీడీవో పుష్పలత ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నమోదు ప్రక్రియ పై శిక్షణ నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే చేసేటప్పుడు నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని అర్హులైన లబ్ధిదారులకే ఎంపిక చేసే విధంగా చొరవ చూపి ఇలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సోమా శ్రీనివాస్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, వివిధ గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### పేదలకు వైద్యం అందడం లేదు

**ప్రజానావ, ఆసిఫాబాద్ టౌన్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సిహెచ్‌సి ఆసుపత్రులలో వైద్యులు సమయపాలన పాటించకపోవడం, ఇన్చార్జిలతోనే సేవలు కొనసాగిస్తుండడంతో పేదలకు సరియైన వైద్యం అందడం లేదని సిపిఎం పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో ఏవో మధుకర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం అందకపోవడంతో పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు ఆశ్రయించాల్సి వస్తుందని దీన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ఆసుపత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్ కుమార్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ఆరోపణలను ఖండించిన ఆర్ఎంపీలు

**ప్రజానావ, బెజ్జూర్**

: మండల కేంద్రంలోని ఆర్ఎంపి భవనంలో శుక్రవారం ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఇబ్రహీం మాట్లాడుతూ.. గత కొన్ని రోజుల క్రితం వాంకిడి మండలంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ద్వారా 60 మంది విద్యార్థులు అస్వస్థత గురై ఓ విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. హాస్టల్ సిబ్బంది ఆర్ఎంపీ వైద్యుల వైద్యం వికటించి విద్యార్థి మృతి చెందిందని తెలపడం దురదృష్టం అన్నారు. విద్యార్థి పరిస్థితి విషమించి హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు అందించారు. ఆరోగ్యం సహకరించక ఫుడ్ పాయిజన్ ద్వారా మృతి చెందినట్లు నిమ్స్ వైద్యులు నిర్ధారించినారు. హాస్టల్ అధికారులు ఆర్ఎంపి వైద్యుల పైన నింద మోపడం సమంజసం కాదని ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపి లపై నిరాధార ఆరోపణలు చేయడం తగదని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఆర్ఎంపి పిఎంపి వైద్యులు ఉన్నారు.



